మెదడుకు కాలుష్యం కాటు!

- నగరంలో పెరుగుతున్న కాలుష్యం
- వాహనాల పొగతో ఇబ్బందులు
- మతిమరుపు, కుంగుబాటు, షుగర్ వంటి వ్యాధులు వచ్చే అవకాశం
- కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టని అధికారులు



కర్నూలు(హాస్పిటల్): సమాజాన్ని కాలుష్యం పట్టి పీడిస్తోంది. ఒకవైపు వాతావరణ కాలుష్యం, మరో వైపు శబ్ద కాలుష్యం, ఇంకోవైపు నీరు, ఆహార పదార్థాల కాలుష్యం ప్రజలను వేధిస్తున్నాయి. తద్వారా అనేక వ్యాధులు ప్రజలను చుట్టముడుతున్నాయి. మనకు తెలియకుండానే దీర్ఘకాలిక వ్యాధులు సైతం చాప కింద నీరులా వస్తున్నాయి. ఇందులో పంట ఉత్పత్తులు పెరిగేందుకు వాడే ఎరువులు, క్రిమి సంహారక మందుల వల్ల మధుమేహం వస్తుండగా, వాయు కాలుష్యంతో మతిమరుపు, డిప్రెషన్, పార్కిన్సన్ వంటి మెదడుకు సంబంధించిన వ్యాధులు వస్తున్నాయి. కాలుష్యాన్ని నియంత్రించాల్సిన ప్రజలు పట్టించుకోకపోవడంతో భవిష్యత్‌లో ఈ పరిస్థితి మరింత విషమించే ప్రమాదం ఉంది.

ఒకప్పుడు మహానగరాల్లో మాత్రమే కాలుష్యం ఉండేది. ఒకవైపు పరిశ్రమలు, మరోవైపు వాహనాల వల్ల వాయు కాలుష్యం, వాహనాల రోద, స్పీకర్ల కారణంగా శబ్దకాలుష్యం ఎక్కువయ్యేది. ఇప్పుడు ఇలాంటి పరిస్థితి ప్రతి జిల్లా కేంద్రంలోనూ ఎదురవుతోంది. మెల్లగా ప్రతి నియోజకవర్గ కేంద్రానికి, చిన్న పట్టణాలకూ వ్యాపిస్తోంది. ప్రస్తుతం ప్రతి ఇంట్లో ఓ వాహనం ఉంది. ఈ కారణంగా కర్నూలు నగరంలో రహదారులు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం అనే తేడా లేకుండా నిత్యం వాహనాలతో కిక్కిరిసిపోతున్నాయి. ఆ సమయంలో అవి వదిలే పొగ కారణంగా కాలుష్యం విపరీతంగా పెరిగిపోతోంది. ఈ యేడాది స్థానిక రాజవిహార్ సెంటర్‌లో నమోదైన పర్టిక్యులేట్ మ్యాటర్ (పీఎం)ను పరిశీలిస్తే జనవరిలో 65, ఫిబ్రవరిలో 64, మార్చిలో 64, ఏప్రిల్‌లో 51, జూన్‌లో 47, జులైలో 45గా ఉంది. సాధారణంగా పీఎం రోజుకు 60 దాటకూడదు. కానీ రాజవిహార్ ప్రాంతంలో కొన్నిసార్లు 60 దాటుతోంది. పరిశ్రమలు ఉండే కల్లూరులో పీఎం స్థాయి కొన్నిసార్లు 70 కూడా దాటుతుండటం ప్రమాదకర స్థితిని తెలియజేస్తోంది. కర్నూలు, నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరు, డోన్, నందికొట్కూరు వంటి ప్రాంతాల్లో వాహనాల పొగతో పాటు దుమ్ము, ధూళి, పరిశ్రమలు వదిలే కాలుష్యంతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

కాలుష్యం వల్ల సమస్యలు

- మెదడు పరిమాణం తగ్గిపోయి మతిమరుపు వస్తుంది
- రసాయనాలు రక్తంలో కలిసి మెదడులోని కీలక భాగాలపై ప్రభావం చూపుతాయి. ఫలితంగా నరాల సమస్యతో కాళ్లు, చేతులు పనిచేయకుండా పోతాయి. కొందరికి పక్షవాతం కూడా రావొచ్చు.
- కొందరు వాసనను గ్రహించలేని స్థితికి చేరుకుంటారు
- వణుకుడు వ్యాధి వచ్చే అవకాశం ఉంది
- మానసిక ఒత్తిడి, కుంగుబాటుకు గురవుతారు
- శరీరంలో హార్మోన్లు సక్రమంగా విడుదల కావు
- వీర్యకణాల సంఖ్య తగ్గిపోయే అవకాశం ఉంది
- పిల్లల్లో ఎదుగుదల సమస్యలు వస్తాయి.
- శబ్ద కాలుష్యం వల్ల మూర్ఛ, మైగ్రేన్ తలనొప్పి, సాధారణ తలనొప్పి వంటివి వస్తాయి
- ఆహార ఉత్పత్తులు త్వరగా, అధికంగా పండించేందుకు ఉపయోగించే రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందుల వల్ల షుగర్ వ్యాధి త్వరగా వస్తుందని వైద్యులు చెబుతున్నారు.

నివారణకు చేయాల్సినవి

- కాలుష్యం బారిన పడకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలి.
- వీలైనంత వరకు ప్రజా రవాణా (బస్సులు) వినియోగిస్తే కాలుష్యం కాస్త తగ్గే అవకాశం ఉంది.
- ద్విచక్ర వాహనంపై వెళ్లేటప్పుడు సర్జికల్ మాస్క్ పెట్టుకుంటే మేలు.
- కాలం చెల్లిన వాహనాల వినియోగాన్ని అధికారులు నివారించాలి.
- ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచాలి. ఈ మేరకు ప్రభుత్వం చర్యలు తీసుకుని ప్రోత్సహించాలి.
- రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటితే కాలుష్యాన్ని తగ్గించవచ్చు.

పెరుగుతున్న దీర్ఘకాలిక వ్యాధులు

వాయు, శబ్ద, నీరు, ఆహార పదార్థాల కాలుష్యం కారణంగా దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ముఖ్యంగా బీపీ, షుగర్ బాధితుల సంఖ్య ఇటీవల కాలంలో వేగంగా పెరుగుతోందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. మరోవైపు ఇప్పటికే ఈ వ్యాధులున్న వారికి అదుపు కావడం లేదని చెబుతున్నారు. ఈ కారణంగా శరీరంలో కీలక అవయవాలైన గుండె, ఊపిరితిత్తులు, కిడ్నీలు, జీర్ణకోశం, నాడీమండలం, కాలేయంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో కిడ్నీలు ఫెయిలై డయాలసిస్ చేయించుకునే వారి సంఖ్య ఒకప్పుడు రోజుకు 40 దాకా ఉంటే ఇప్పుడు 50 దాటింది.

నీరు, ఆహార కాలుష్యం వల్ల షుగర్



వాయు కాలుష్యం వల్ల షుగర్ వస్తుందని ఇప్పటి దాకా ఎలాంటి అధ్యయనాలు లేవు. కానీ నీరు, ఆహార ఉత్పత్తులు పండించేందుకు ఉపయోగించే రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందుల వల్ల త్వరగా షుగర్ వ్యాధి వస్తుందని తేలింది. ప్లాస్టిక్ బాటిల్స్‌లో నీరు తాగడం, ప్లాస్టిక్ కవర్లలో తినడం వల్ల కూడా పాంక్రియాస్‌లో బీటాసెల్‌ను నాశనం చేస్తున్నాయి. దీని వల్లే షుగర్ రావడంతో పాటు మగవారిలో వీర్యకణాలు తగ్గిపోయేందుకు అవకాశం ఉంది.

–డాక్టర్ పి.శ్రీనివాసులు, ఎండోక్రైనాలజీ విభాగాధిపతి, జీజీహెచ్, కర్నూలు

కాలుష్యం వల్ల మెదడుపై ప్రభావం



వాతావరణ కాలుష్యం వల్ల మనుషులకు డిమెన్షియా (మతిమరుపు) వ్యాధి, పార్కిన్సన్ ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని అధ్యయనాలు చెబుతున్నాయి. శబ్దకాలుష్యం వల్ల మైగ్రేన్ తలనొప్పి, టెన్షన్, తలనొప్పి పెరుగుతుంది. కాబట్టి బయట తిరిగే సమయంలో ప్రతిఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. వాహన, వాతావరణ కాలుష్యానికి గురిగాకుండా సర్జికల్ మాస్క్ ధరించాలి. శబ్ద కాలుష్యానికి దూరంగా ఉండాలి.

– డాక్టర్ హేమంత్‌కుమార్, న్యూరోఫిజీషియన్, కర్నూలు

నేడు వినతుల స్వీకరణ

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం 11 గంటలకు మీ కోసం – ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు నగరపాలక కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సమస్యలపై నగర ప్రజలు దరఖాస్తుతో పాటు ఆధార్‌కార్డు జిరాక్స్, సెల్‌ఫోన్ నంబర్‌తో నగరపాలక కార్యాలయంలో అందజేయవచ్చని తెలిపారు. సమస్యను పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(సెంట్రల్): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలు ఉన్న ప్రజలు వినతులు అందించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్‌తో పాటు అన్ని మండల, డివిజనల్, మునిసిపల్ కార్యాలయాల్లోనూ నిర్వహించి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు ఆయన వివరించారు.

నేడు 'మిస్టర్ బచ్చన్' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్

కర్నూలు కల్చరల్: రవితేజ హీరోగా నటించిన 'మిస్టర్ బచ్చన్' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ సోమవారం కర్నూలు నగరంలో జరగనుంది. హరీశ్ శంకర్ దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థ నిర్మించిన ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను సాయంత్రం 6 గంటలకు ఎస్టీబీసీ కళాశాల మైదానంలో నిర్వహించనున్నారు. ఈ మూవీలో భాగ్య శ్రీ హీరోయిన్‌గా నటించారు. మిక్కీ జే మేయర్ సంగీతం అందించారు.

వీఆర్వోలకు పదోన్నతులు కల్పించాలి

కర్నూలు(సెంట్రల్): అర్హులైన గ్రేడ్–1 వీఆర్వోలకు పదోన్నతులు కల్పించేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని ఏపీ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సూరిబాబు, మద్దిలేటి ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉన్నతాధికారుల అలసత్వంతోనే వీఆర్వోల పదోన్నతులకు ఆలస్యం అవుతోందన్నారు. ఏపీఆర్ఎస్ఏ సంఘం వీఆర్వోల పదోన్నతులకు సహరిస్తోందని, సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం తప్పు అని వారు ఖండించారు.

క్లుప్తంగా

ట్రాఫిక్ ఉల్లంఘనులకు కౌన్సెలింగ్



పట్టుబడిన వారికి కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ ఇన్‌చార్జ్ సీఐ జీవీ నాగరాజు

కర్నూలు కల్చరల్: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడిపితే జరిమానా తప్పదని కర్నూలు ట్రాఫిక్ ఇన్‌చార్జ్ సీఐ జీవీ నాగరాజు హెచ్చరించారు. సైలెన్సర్లు లేకుండా అధిక శబ్దాలతో తిరిగే 20 ద్విచక్ర వాహనాలను ఆదివారం స్పెషల్ డ్రైవ్‌లో పట్టుకొని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లఘించే వారిపై చర్యలు తప్పవన్నారు. అనంతరం వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు.

భక్తిశ్రద్ధలతో అభిషేక పూజలు



సూర్య నారాయణ స్వామికి హారతి ఇస్తున్న అర్చకులు

కర్నూలు కల్చరల్: భాను సప్తమిని పురస్కరించుకొని ఆదివారం స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సూర్యనారాయణ స్వామిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు స్వయంగా శ్రీ సూర్యనారాయణ స్వామి వారికి సుగంధ ద్రవ్య జలాలతో అభిషేకం చేశారు. అరుణ హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

పల్లేటి మరణం తీరని లోటు



పల్లేటి కులశేఖర్ చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న కళాకారులు

కర్నూలు కల్చరల్: ప్రముఖ సినీ, నాటక రచయిత పల్లేటి కులశేఖర్ మరణం నాటక రంగానికి తీరని లోటని విద్యావేత్త జి.పుల్లయ్య అన్నారు. ఆదివారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో నెల్లూరు శ్రీ లక్ష్మీ నృసింహ నాటక కళా మండలి వారిచే తొలి వాగ్గేయకారులు తాళ్లపాక అన్నమాచార్యుల చరిత్ర 'భక్త అన్నమయ్య' పద్య నాటక ప్రదర్శన జరిగింది. అంతకుముందు పల్లేటి కులశేఖర్ సంస్మరణ సభ జరిగింది. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీజీవీ కళాక్షేత్రం తరపున నాటక దర్శకులు జానకి రాముడుకు రూ.60 వేలు పారితోషికం అందించి సత్కరించారు. కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య, కార్యదర్శి మహమ్మద్ మియ్యా, సభ్యులు, కళాకారులు పాల్గొన్నారు.

పని సర్దుబాటులో మినహాయింపు ఇవ్వాలి



మాట్లాడుతున్న ఎస్.గోకారి

కర్నూలు కల్చరల్: దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ఉపాధ్యాయులకు పని సర్దుబాటు నుంచి మినహాయింపు ఇవ్వాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.గోకారి కోరారు. ఆదివారం ఎస్టీయూ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల పదవీ విరమణతో ఆయా పాఠశాలల్లో కొరత తీవ్రంగా ఉందన్నారు. ప్రభుత్వం చేపడుతున్న పని సర్దుబాటును జీఓ నంబర్ 53 ప్రకారం చేపట్టాలని డిమాండ్ చేశారు. జూనియర్‌ను గుర్తించే విషయంలో క్యాడర్ సీనియారిటీని తప్పకుండా పాటించాలన్నారు. 60 ఏళ్లు నిండిన ఉపాధ్యాయులకు పని సర్దుబాటు ప్రక్రియ నుంచి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంఘం నాయకులు పాల్గొన్నారు.

బలిజ సంఘం కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన బలిజ సంఘం సభ్యులు

కర్నూలు(అర్బన్): నగరంలోని అబ్బాస్ నగర్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఆదివారం జరిగిన సమావేశంలో నగర బలిజ సంఘానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర కాపునాడు అధ్యక్షుడు ఆర్జా రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సంఘం నగర అధ్యక్షుడిగా టి.గోపినాథ్, కార్యదర్శిగా మండ్లం రవి, కోశాధికారిగా శైలేష్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. సంఘం నాయకులు పత్తి ఓబులయ్య, చింతలపల్లి రామకృష్ణ, అల్లం రఘునాథ్, గాజుల సతీష్, ప్రేమ్‌కుమార్‌రెడ్డి, బ్రాహ్మణి, హేమలత, డాక్టర్ రంగనాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖలో ఖాళీలను భర్తీ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డి.రాఘవేంద్ర

కర్నూలు(సెంట్రల్): విద్యుత్‌శాఖలో ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేసి ఉద్యోగులపై భారం తగ్గించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్ డిమాండ్ చేశారు. ఆదివారం డీవైఎఫ్ఐ కార్యాలయంలో ఏర్పాటు సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ సంస్థల్లో ఇంజినీర్ల కొరత వేధిస్తున్నా నియామకాలు చేపట్టడం లేదన్నారు. మూడు విద్యుత్ సంస్థల్లో 7500 మంది ఉద్యోగులు ఉండాల్సిన పరిస్థితుల్లో 2500 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. వాటిని వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర, నాయకులు వీరేష్, సురేష్, వెంకటేష్, నాగరాజు పాల్గొన్నారు.

డ్రగ్స్‌ను కట్టడి చేయాలి

విచ్చలవిడిగా డ్రగ్స్ వినియోగంతో యువత పెడదోవ పడుతోందని, నియంత్రణకు చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కె.రాఘవేంద్ర డిమాండ్ చేశారు. ఆదివారం సుర్జీత్ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో యూత్ సెంటర్లను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో కాకాపాషా, ఎస్ఎండీ షరీఫ్ పాల్గొన్నారు.

నదీ తీర ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



సూచనలు చేస్తున్న కమిషనర్ రామలింగేశ్వర్

కర్నూలు (టౌన్): తుంగభద్ర నది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నగరపాలక కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్ సూచించారు. ఆయన ఆదివారం నగరపాలక అధికారులు, సచివాలయాల సిబ్బందితో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నది లోతట్టు పరిసర ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ఆదివారం రాత్రికి నీటి ఉధృతి పెరిగే అవకాశం ఉందని, ఈ విషయాన్ని ప్రజలకు తెలియజేయాలని సూచించారు. కర్ణాటకలోని షిమోగాలో వర్షాల కారణంగా హొస్పేట్‌లోని తుంగభద్ర జలాశయానికి భారీగా వరద నీరు చేరుతోందన్నారు. దీంతో శనివారం రాత్రి డ్యాం చైన్ లింక్ తెగి 19వ గేటు గల్లంతైందన్నారు. ఇప్పటికే లక్షకు పైగా క్యూసెక్కుల నీరు వృథాగా ప్రవహిస్తోందని, దాదాపు 60 టీఎంసీల నీరు నదికి వస్తుందని చెప్పారు. తుంగభద్ర నది పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

రెండు నెలలకే ధ్వంసమైన ఫుట్‌పాత్‌లు



గాయత్రీ ఎస్టేట్ సమీపంలో దెబ్బతిన్న ఫుట్‌పాత్‌లు

కర్నూలు (టౌన్): స్థానిక గాయత్రీ ఎస్టేట్ నుంచి బిర్లా గేట్‌కు వెళ్లే రహదారిలో ఇటీవల ఫుట్‌పాత్ నిర్మాణం చేపట్టారు. స్మార్ట్ స్ట్రీట్ పేరుతో నగరపాలక జనరల్ ఫండ్ నుంచి రూ.15 లక్షలు కేటాయించారు. ఈ నిధులతో రిలయన్స్ స్టోర్ నుంచి రహదారి విస్తరణ, ఫుట్‌పాత్ నిర్మాణం వంటి పనులు చేపట్టారు. అయితే రెండు నెలలు కూడా పూర్తి గాకముందే ఫుట్‌పాత్ దెబ్బతింది. ఏ ఒక్కరూ నడవలేని విధంగా ధ్వంసం కావడానికి కారణం పనుల్లో నాణ్యత లోపించమేనని స్థానికులు విమర్శిస్తున్నారు. పనులు అధ్వానంగా చేసిన కాంట్రాక్టర్‌తో పాటు పర్యవేక్షణను పట్టించుకోని నగర పాలక ఇంజినీరింగ్ అధికారులపై విమర్శలు వస్తున్నాయి.



సమాచార కార్యాలయానికి వెళ్లే దారిలో నిలిచిన వర్షపునీరు, డీఈఓ కార్యాలయానికి వెళ్లే దారి దుస్థితి



కలెక్టరేట్ ముఖ ద్వారం వద్ద బురదమయమైన దృశ్యం

చినుకు పడితే చిత్తడే!

నగరంలో శనివారం రాత్రి కురిసిన జోరు వర్షానికి కలెక్టరేట్ అంతా చిత్తడిగా మారింది. కలెక్టర్ చాంబర్ ముందు వర్షపు నీరు నిలిచింది. కార్యాలయం ఆవరణ బురదమయంగా మారగా పలు విభాగాల కార్యాలయాలు చిత్తడిగా మారాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

ముగిసిన రోప్ స్కిప్పింగ్ పోటీలు

కర్నూలు (టౌన్): రెండు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. విజేతగా గుంటూరు, రెండో స్థానంలో నంద్యాల, మూడో స్థానంలో అన్నమయ్య జిల్లా క్రీడాకారులు నిలిచారు. విజేతలకు అసిస్టెంట్ కమాండెంట్ మహబూబ్‌బాషా, నైస్ కంప్యూటర్స్ అధినేత రాయపాటి శ్రీనివాస్ కప్పులు, మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థి దశలో క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు.

బాధ్యతల స్వీకరణ

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు రూరల్ సీఐగా చంద్రబాబునాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం ఆయన స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఉన్నతాధికారులతో పాటు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతపురం జిల్లాకు చెందిన ఆయన గతంలో జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లలో ఎస్ఐగా, సీఐగా పనిచేశారు.

హిందూ ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించాలి

కర్నూలు కల్చరల్: విశ్వహిందూ పరిషత్ షష్ఠ్యబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని ప్రఖండ డివిజన్లలో హిందూ ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించాలని వీహెచ్‌పీ దక్షిణాంధ్ర రాష్ట్ర ఉపాధ్యక్షులు సోమిశెట్టి వెంకటరామయ్య పిలుపునిచ్చారు. ఆదివారం వీహెచ్‌పీ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈనెల 26వ తేదీకి వీహెచ్‌పీ ఏర్పాటై 60 సంవత్సరాలు పూర్తవుతుందన్నారు. జిల్లాలోని అన్ని గ్రామాలు, నగరాల్లో వీహెచ్‌పీ సమితుల నిర్మాణం జరగాలన్నారు. వీహెచ్‌పీ రాష్ట్ర కార్యదర్శి కాకర్ల రాముడు మాట్లాడుతూ ఈనెల 16 నుంచి 31వ తేదీ వరకు ప్రఖండ కేంద్రాల్లో నిర్వహించ బోయే హిందూ ఆత్మీయ సమ్మేళనాల్లో అయోధ్య రాముడి ఆలయానికి నిధి సమర్పణ చేసిన ప్రముఖులు కుటుంబాలు పాల్గొనేలా చూడాలన్నారు. జిల్లా అధ్యక్షులు టీసీ మద్దిలేటి, కోశాధికారి సందడి మహేశ్వర్, రాష్ట్ర సేవా ప్రముఖ్ గురుమూర్తి, రాష్ట్ర కార్యాలయ సహాయక్ భూపాలచారి, ధర్మ ప్రసార్ విభాగ్ కన్వీనర్ విజయుడు, బజరంగ్ దళ్ కన్వీనర్ మీనుగు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌యూలో నీటి సమస్య పరిష్కరించాలి



ఎంపీ నాగరాజును సన్మానిస్తున్న ఆర్‌యూ వీసీ ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయంలో నీటి సమస్యను పరిష్కరించాలని వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ డాక్టర్ సముద్రాల వెంకటేశ్వర్లు కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజును విన్నవించారు. ఆదివారం ఎంపీ స్వగృహంలో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఆర్‌యూలోని సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. వర్సిటీలోని కాంట్రాక్ట్, ఉద్యోగులు, అవుట్ సోర్సింగ్ సిబ్బందికి మూడేళ్లుగా జీతాలు రావడం లేదని, బోధన, బోధనేతర పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. వర్సిటీ సమస్యలను మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చినట్లు వీసీ ఎన్‌టీకే నాయక్ తెలిపారు.

అవయవ దానానికి ముందుకు రావాలి



అవగాహన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ మహబూబ్‌బాషా, లయన్స్ క్లబ్ ప్రతినిధులు

కర్నూలు(హాస్పిటల్): మూఢ నమ్మకాలకు పోకుండా ప్రతిఒక్కరూ అవయవ దానానికి ముందుకు రావాలని రెండవ పటాలపు డీఎస్పీ మహబూబ్‌బాషా పిలుపునిచ్చారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక గార్గేయపురంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు, స్పోర్ట్స్ క్యాంపునకు వచ్చిన వారికి అవయవ దానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అవయవ దాన ఆవశ్యకతను వివరించే పోస్టర్లను ప్రదర్శించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ.. వ్యక్తి జీవించి ఉన్నప్పుడే అవయవ దాన ధ్రువీకరణ పత్రాన్ని సంబంధిత అధికారికి అందజేయాలన్నారు. లేదా రెడ్‌క్రాస్ సొసైటీని సంప్రదించవచ్చని తెలిపారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ ప్రతినిధి రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఒక వ్యక్తి అవయవాలను దానం చేయడం వల్ల ఎనిమిది మందికి పైగా ప్రాణాలను కాపాడవచ్చని వివరించారు. కంటి వైద్యులు డాక్టర్ జయప్రకాష్, డాక్టర్ ప్రభాకర్, హెచ్ఎం వెంకటరాముడు, ఏసేపు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విద్యతోనే మహిళాభ్యుదయం



టాపర్‌గా నిలిచిన విద్యార్థినిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ ఇందిరాశాంతి

కర్నూలు(అర్బన్): విద్యతోనే మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తారని, తల్లిదండ్రులు తమ కుమార్తెలను చదివించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని ఫర్‌మెన్ కళాశాల ప్రిన్సిపాల్ ఇందిరాశాంతి అన్నారు. ఆదివారం సాయంత్రం నగరంలోని సాంఘిక సంక్షేమ శాఖ నంబర్–1 కళాశాల బాలికల వసతి గృహంలో డిగ్రీలో టాపర్స్‌గా నిలిచిన విద్యార్థినుల అభినందన కార్యక్రమం నిర్వహించారు. వసతి గృహ సంక్షేమాధికారిణి బెన్నమ్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఇందిరాశాంతి మాట్లాడుతూ.. వసతి గృహంలో పలువురు విద్యార్థినులు కళాశాల టాపర్స్‌గా నిలవడం చాలా అభినందనీయమన్నారు. టాపర్స్‌కు శాలువా, పూలమాల తో ఘనంగా సన్మానించారు. అలాగే ప్రిన్సిపాల్ ఇందిరాశాంతి, వసతి గృహ సంక్షేమాధికారిణులు బెన్న మ్మ, రజనమ్మను కూడా ఘనంగా సన్మానించారు.

వైభవంగా సాయి శత రుద్రీయం



ప్రత్యేక అలంకరణలో స్వామివారి ఉత్సవ మూర్తులు

కర్నూలు కల్చరల్: భగవాన్ శ్రీ సత్యసాయిబాబా జయంతి పురస్కరించుకొని శ్రీ సత్యసాయి మయూరి గ్రీన్ ల్యాండ్స్ భజన మండలి ఆధ్వర్యంలో శ్రీఅభీష్ట జ్ఞాన గణపతి స్వామి దేవస్థానంలో ఆదివారం నమామి సాయి శత రుద్రీయం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. సాయి చిత్రపటంతో శోభాయాత్ర నిరహించారు. కోలాటం, చెక్క భజనలు, సాయి నామ కీర్తనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రశాంతి పతాకావిష్కరణ, గోమాత పూజ జరిగాయి. శ్రీ సత్యసాయి ప్రేమ తరు (మొక్కలు నాటడం), 91వ మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం జరిగింది. నిర్వాహకులు డాక్టర్ హరిశర్మ, శకుంతల, డాక్టర్ అనిల్ వేద బృందం, శ్రీ సత్యసాయి సమితి జిల్లా అధ్యక్షుడు డి.సాయికృష్ణారెడ్డి, కన్వీనర్ పి.నాగిరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

ఈత సరదా

మొన్నటి దాకా నీటి ప్రవాహం లేక వెలవెలబోయిన కేసీ కెనాల్‌కు అధికారులు నీటిని విడుదల చేయడంతో జలకళ సంతరించుకుంది. నగర నడిబొడ్డున కాలువలో నీటి ప్రవాహాన్ని చూసి ఉత్సాహం ఉరకలేస్తుండగా పలువురు ఈత కొట్టేందుకు నీటిలోకి దిగుతున్నారు. ఆదివారం సెలవు దినం కావడంతో స్టాంటన్‌పురం సమీపంలో కేసీ కెనాల్‌లో పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఈదులాడుతూ ఆనందంతో కేరింతలు కొట్టారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

